
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 23 ఫిబ్రవరి 2023
5
వైఎస్ఆర్



సిఎంను కలిసిన ఎఫ్‌యూ విసి


సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విసి ఆంజనేయప్రసాద్

కడప అర్బన్: నగరంలోని డాక్టర్ వైయస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (ఎఫ్‌యూ) విసిగా ప్రొఫెసర్ బి.ఆంజనేయ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. బుధ వారం క్యాంప్ కార్యాలయంలో సిఎం జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎఫ్‌యూ మొట్ట మొదటి విసిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్శిటీ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. ఎఫ్‌యూని దేశంలోనే ప్రత్యేకమైన విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా నామినేషన్లు

కడప, అనంతపురం కలెక్టరేట్లలో కోలాహలం
స్థానిక సంస్థల, పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల జోరు
భారీ అనుచరగణంతో తరలిన అభ్యర్థులు


అనంతపురంలో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు అట్టహాసంగా దాఖలయ్యాయి. ఈ నెల 13 నుంచి 23వ తేదీతో నామినేషన్ల గడువు ముగియనుంది. బుధవారం నామినేషన్లు జోరు వెల్లువెత్తింది. నామినేషన్ల దాఖలు గడువు ముగింపునకు ఒక్కరోజు సమయం ఉండగానే కడప, అనంతపురం కలెక్టరేట్లలో స్థానిక సంస్థల, పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పలువురు తమ అనుచర గణాలతో కలిసి పోటాపోటీగా దాఖలు చేశారు. కడప, అనంతపురం కలెక్టరేట్లలో సందడి వాతావరణం నెలకొంది. నామినేషన్ల దాఖలు సందర్భంగా ఆశావహులు పెద్దఎత్తున కదలిన నేపథ్యంలో కలెక్టరేట్ ఎదుట భారీగా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల అధిక సంఖ్యలో ఉన్న సంగతి తెలిసిందే. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు అనంతపురం కలెక్టరేట్‌లో నామినేషన్లు దాఖలు చేయడానికి మొగ్గు చూపించినట్లు కనిపిస్తోంది. పట్టభద్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి సహా పలువురు స్వతంత్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, ఎ.రామచంద్రారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, భారీ అనుచరులతో కలిసి నామినేషన్లు దాఖలు చేశారు. కడప కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి నామినేషన్ చేశారు. జిల్లాలో వైసిపికి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు గణనీయ సంఖ్యలో ఉండడం, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు చేతివేళ్ల మీద లెక్కబెట్టాల్సిన పరిమిత సంఖ్యలో ఉన్న అభ్యర్థులు గెలిచిన సంగతి తెలిసిందే. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఆశావహులు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాల నామినేషన్ దాఖలు చేయడానికి ముందుకురాని నేపథ్యం నెలకొంది. వైసిపి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం దాదాపుగా ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈలెక్కన పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల మధ్య ప్రధానంగా ఎన్నికల్లో పోటీ నెలకొనే అవకాశాలు ఉన్నట్లు పరిశీలకుల అంచనా.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పిఆర్ నామినేషన్ దాఖలు

కడప: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారి జెసి సాయికాంత్ వర్మ నామినేషన్ పత్రాలను సమర్పించారు. రామసుబ్బారెడ్డి వెంట ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా ఉన్నారు. అంతకు ముందు శిల్పారామంలో ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీగా రామసుబ్బారెడ్డి గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, వైసిపి కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు సురేష్ బాబు, శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కోరుముట్ల శ్రీనివాసులు, సుధీర్‌రెడ్డి, డాక్టర్ సుధా, జిల్లాలోని జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలను చట్టసభలకు పంపుదాం

అనంతపురం ప్రతినిధి: ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను చట్టసభలకు పంపిచాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట తప్పను.. మడమ తిప్పను.. అన్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి, ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్కమాటను నిలుపుకోలేదని చెప్పారు. ఆయన మాటా తప్పాడు...మడమా తిప్పాడూ అని విమర్శించారు. చట్ట సభల్లో ప్రజా సమస్యలపై ఇప్పుడు చర్చ జరగడం లేదని విచారం వ్యక్తం చేశారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించి మండలికి పంపాలని పిలుపునిచ్చారు. ప్రశ్నించే గొంతుకలను మండలికి పంపడం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించగలన్నారు. ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడుతూ మండలి ఎన్నికలు కౌరవులు, పాండవులకు మధ్య జరుగుతున్న పోరు అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిలదీసే పిడిఎఫ్ అభ్యర్థులను ఓడించేందుకు అధికారపార్టీ సాయశక్తులను ఒడ్డుతోందని చెప్పారు. పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు మాట్లాడుతూ ఇన్ని ప్రజాసంఘాలు వచ్చి తమ అభ్యర్థిత్వాన్ని బలపరచడంతోనే తమకు నైతిక విజయం లభించినట్టయిందన్నారు. కొంత మంది అధికారులను ఇక్కడికి పంపి ప్రలోభ పెట్టే ప్రయత్నాలు ఇప్పటికే చేస్తోందన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి విస్మరించారని తెలిపారు. సిపిఎస్‌పైనా, పిఆర్‌సిపైనా మండలిలో గొంతెత్తామని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ ఈ సమస్యలపై పోరాటాన్ని సాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి, యుటిఎఫ్, ఎస్టీయు, ఐద్వా, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్, బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కడప : ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న పిఆర్

వైసిపిని ఓడించే సత్తా దూదేకులకు ఉంది

- రాష్ట్ర అధ్యక్షులు మన్నూరు అక్బర్

ప్రజాశక్తి-కడప అర్బన్

వైసిపిని 88 నియోజకవర్గాలలో ఓడించే సత్తా దూదేకులకు ఉందని టిడిపి అధికార ప్రతినిధి రాష్ట్ర దూదేకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మన్నూరు అక్బర్ అన్నారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి అభ్యర్థులను కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రాయచోటి, బద్వేల్, ఓడిస్తామని పేర్కొన్నారు. పులివెందులలో మెజారిటీ తగ్గిస్తామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం దూదేకుల వారిని బానిసలుగా చూస్తుందని చెప్పారు. దానికి నిదర్శనం రాష్ట్రంలో శాసన మండలి లో ఒక్కరికి కూడా మైనారిటీ లో వెనుక బడిన మైనారిటీ వర్గానికి చెందిన దూదేకుల వారికి ఎమ్మెల్సీ ఇవ్వక పోవడమే అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, వైసిపి ఎమ్మెల్యేలు చాలా అవమానకరంగా చూస్తూ రాజకియంగా అనగదొక్కు తున్నారని, దూదేకులు పూర్తి స్థాయిలో గమనించి వైసిపికి బుద్ది చెప్పాలని పిలుపు నిచ్చారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు గతంలో విజయవాడ నుంచి ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చారని, అధికారలో ఉన్నపుడు మూడు పదవులు క్యాబినెట్ స్థాయి పదవులు ఇచ్చి ప్రోత్సహించారని స్పష్టం చేశారు. టిడిపి అధికారంతో లోకేష్ నాయకత్వంలో దూదేకుల వారు చట్ట సభలకు పంపుతామని తెలిపారు. దూదేకుల వారికి తెలిసే విదంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రెస్ సమావేశాలు ఏర్పాటు చేస్తామని, తద్వారా వైసిపి ప్రభుత్వం దూదేకుల వారికి జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ దస్తగిరి దూదేకుల నాయకులు నాగూర్, నజిర్, నరసింహ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మన్నూరు అక్బర్

దేశానికే ఆదర్శం సిఎం జగన్ పాలన

ప్రజాశక్తి - కడప

అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర, దేశానికి ఆదర్శంగా నిలిచారని వైఎస్ జగన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్మోహన్‌రెడ్డి పాలనలో బిసిలకు పాలకవర్గంలోనూ కార్పొరేషన్ పదవుల్లోనూ 50 శాతం బిసిలు అవకాశం ఇచ్చారన్నారు. అన్ని వర్గాల వారికి సామాజిక న్యాయం చేస్తూ రాష్ట్ర, దేశ చరిత్రలో ఏకైక ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి నిలిచారని కొనియాడారు. సమావేశంలో ఎం.వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంపై దాడి నీతిమాలిన చర్య

ప్రజాశక్తి-కడప అర్బన్

గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై వైసిపి గుండాలు దాడి చేసి, వాహనాలకు నిప్పంటించడం నీతిమాలిన చర్య అని టిడిపి నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి మండిపడ్డారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు పర్యటన, లోకేష్ పాదయాత్రకు ప్రజాదరణ ఓర్వలేక, విధ్వంసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. టిడిపి అధికార ప్రతినిధి పట్టాభిని ముఖానికి గుడ్డ కప్పి పోలీసులు ముసుగు దొంగల్లా కొట్టడం పోలీసు శాఖకే మాయని మచ్చ అన్నారు. ప్రజా ఆస్తులకు, పార్టీల నాయకులకు రక్షణ కల్పించాల్సిన, పోలీసులు రివర్స్ విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం ఉందా అని ఆయన అనుమానం వ్యక్తపరిచారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని చెప్పారు. ప్రజలు ప్రజా సంక్షేమానికి పాటుపడే చంద్రబాబు పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. టిడిపి కార్యాలయ ధ్వంసం, టిడిపి నేత పట్టాభిపై దాడిని ఖండించారు.

విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన మంజూరు

కడప: కళాశాల, సచివాలయంలో నమోదైన విద్యార్థులకు మాత్రమే జగనన్న విద్యా దీవెన మంజూరు అవుతుందని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత సంయుక్త సంచాలకులు జయప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 సంవత్సరానికి గాను ప్రభుత్వం ఈ నెల 28వ తేదీన జగనన్న విద్యా దీవెన పథకం కింద డబ్బులు మంజూరు చేస్తుందని తెలిపారు. చాలామంది విద్యార్థులు ఇంకా కళాశాలలో రెన్యువల్, ఫ్రెష్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నలేదని తెలిపారు. జగనన్న విద్యా దీవెన కోసం కళాశాలలో రెన్యువల్ రిజిస్ట్రేషన్ మరియు మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులు (ఫ్రెష్ స్టూడెంట్స్) కాలేజ్ లాగిన్‌లో రిజిస్ట్రేషన్ వెంటనే చేసుకోవాలని తెలిపారు. ఈ మేరకు వైయస్సార్ జిల్లాలోని కళాశాలల యాజమాన్యాల ప్రధానచార్యులు, సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కళాశాలలో రిజిస్ట్రేషన్ అయిన విద్యార్థులు వెంటనే సచివాలయంలో మీ యొక్క దరఖాస్తును నమోదు చేసుకోవాలని తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి


కడప: ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి మానవాళికి హానికరమని ప్లాస్టిక్ వ్యర్థ రహిత సమాజం కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ తెలియజేశారు. ప్రభుత్వ పురుషుల కళాశాల సిబ్బంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సంయుక్తంగా కలిసి బుధవారం ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానము లోని ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను, పాత సీసాలను తొలగించారు. మైదానంలో నడకకు వచ్చేటువంటి ప్రజలకు అవగాహనను కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అంకాల నాగరాజు, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ సావిత్రి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ భూషణ్ రెడ్డి, డాక్టర్ నాగేశ్వర రాజు, హజరత్ అయ్య, వెంకటలక్ష్మి, డాక్టర్ కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయల్ రషీద్ కుటుంబానికి తులసిరెడ్డి పరామర్శ

కడప: రాయల్ రషీద్ కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలో 40 సంవత్సరాలుగా రాయల్ ఫోటో స్టూడియో నిర్వహిస్తూ, అనేక ప్రభుత్వ, ప్రభుత్వ కార్యకలాపాలను కవర్ చేసేవారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, రామకృష్ణ, అమర్, ఉత్తన్న, శివ, సత్యం పాల్గొన్నారు.

చేపల పెంపకంపై విద్యార్థులకు అవగాహన

కడప: కడప ఆర్ట్స్ కళాశాల జంతు శాస్త్ర శాఖ వారి ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులు, అధ్యాపక బృందం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం నెల్లూరు మత్య శాఖను సందర్శించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రత్యేకంగా మత్స్య శాఖను వీక్షించడం ద్వారా విషయ సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవడం సులభతరం అవుతుందన్నారు. జంతు శాస్త్ర శాఖ వారు ఇలాంటి కార్యక్రమాలు చేయడంలో ముందు ఉండడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. మత్స శాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరాజు విద్యార్థులకు చేపల నిర్వహణ కోసం తీసుకునే చర్యలను వివరించారు. ఎఫ్‌డిఓ సురేష్ విద్యార్థులకు రొయ్యలు, చేపల చెరువుల పెంపకం, యాజమాన్య విధానాలను ప్రత్యక్షంగా చూపించి వివరించారు. జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రవి శేఖర్ విద్యార్థులకు చేపల పెంపకం యొక్క ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ వై.సావిత్రి, భోదనేతార సిబ్బంది రామ చంద్రయ్య, శ్రీనివాసులు, లక్ష్మి రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


చేపల పెంపకాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

వాల్మీకులకు న్యాయం జరుగుతుంది

- ఏకసభ్య కమిషన్ చైర్మన్ శ్యామూల్ ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి - కడప

ఏకసభ్య కమిషన్ ద్వారా వాల్మీకులకు న్యాయం జరుగుతుందని ఏకసభ్య కమిషన్ చైర్మన్ శామ్యూల్ ఆనంద్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని విసి హాలులో వాల్మీకుల సామాజిక వర్గాన్ని ఎస్టీలో చేర్చాలనే అంశంపై అధ్యయనం చేసేందుకు ప్రజాప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సామాజిక, రాజకీయ న్యాయం కల్పిస్తూ ఆదర్శ ప్రభుత్వంగా ఆధారభిమానాలను అందుకుంటోందన్నారు. రాష్ట్రంలో కొన్నేళ్లుగా బోయలను ఎస్టీల్లో చేర్చాలనే డిమాండును త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం అధ్యయనం చేసేందుకు ముందదుగు వేసి ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసి అధ్యయనం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని బోయ, వాల్మీకి సామాజిక వర్గ ప్రజలకు న్యాయబద్ధమైన, ఆమోదయోగ్యమైన రిజర్వేషన్ సదుపాయం అందనుందన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన పలువురు బోయలు తమను ఎస్టీలో చేర్చాలనే అంశాన్ని బలపరుస్తూ వారివారి అభిప్రాయాలను వెల్లడించారు. బోయలు ఎస్టీల్లో చేరిస్తే రిజర్వేషన్ దృష్ట్యా వారికి ఎదురయ్యే పరిణామాలను పలువురు ఎస్టీలు కమిషన్‌కు వివరించారు. సమావేశం అనంతరం పలువురు వినతి పత్రాలను ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు అందజేశారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ఇడి డాక్టర్ హెచ్.వెంకట సుబ్బయ్య, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వి.బ్రహ్మయ్య, బోయ,వాల్మీకి కమిషన్ డైరెక్టర్ నారాయణ స్వామి, నాయకులు వెంకట రమణ, ఎర్రమాని రామచంద్ర, సునీల్, సుంకర నాగేశ్వర, వెంకట నారాయణ, పెద్దిరాజు పాల్గొన్నారు.


చైర్మన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

బంగారం, నగదు స్వాధీనం : ఎస్‌పి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి అన్బురాజన్

ప్రజాశక్తి-కడప అర్బన్

మైదుకూరు పరిధిలో ఇంటికి కన్నాలు వేసి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారని ఎస్‌పి అన్బురాజన్ పేర్కొన్నారు. బుధవారం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్ ఆధ్వర్యంలో మైదుకూరు రూరల్ సిఐ నరేంద్రారెడ్డి సూచనల మేరకు రాబడిన సమాచారంపై బి.మఠం ఎస్ఐ ఎ.విద్యాసాగర్ వారి సిబ్బంది కలసి ఈ నెల 21న బి.మఠం మండలంలోని నందిపల్లె క్రాస్ వద్ద సురేష్, కిరణ్ బాబు అనే అంతర్ రాష్ట్ర దొంగలను పట్టుకున్నారని చెప్పారు. సదరు దొంగలు 2019, 2020, 2023వ సంవత్సరంలో బి.మఠం మండలంలోని గంగిరెడ్డిపల్లె, నరసన్నపల్లె, లింగాల దిన్నెపల్లె గ్రామాలలో దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. అరెస్టు చేసిన వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు, కొంత డబ్బును స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. మరో ఇద్దరు నిందితులు ఉమా మహేశ్వర్‌రావు, తాటిచెర్లకు చెందిన కోళ్ళబాబు రావును పట్టుకోవాల్సి ఉందని చెప్పారు. దొంగతనాలు చేసే వారిపై నిఘా వుంచి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'సీమ' పోరాట పటిమకు నిదర్శనం 'ఉయ్యాలవాడ'

ప్రజాశక్తి-కడప అర్బన్

రాయలసీమ తొలి స్వాతంత్ర్య పోరాట యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఈ ప్రాంత పోరాట పటిమకు నిదర్శనమని నగర డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి అభిప్రాయపడ్డారు. బుధవారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక రాజీవ్ మార్గ్‌లోని రెడ్డి సేవా సమితి హాస్టల్ ఆవరణలో సభ నిర్వహించారు. తొలుత నరసింహారెడ్డి చిత్రం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంగ్లేయులపై తొలి తిరుగుబాటు చేసి స్వాతంత్ర్య సమరానికి తొలి బీజం వేసిన వ్యక్తి మన ప్రాంతపు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కావడం మనందరికీ గర్వకారణమన్నారు. ఆయన ఘన చరితను నేటి తరానికి తెలుపడానికి రెడ్డి సేవా సమితి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ సంస్థలు బాధ్యత తీసుకోవడం అభినందనీయమన్నారు. నగరంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు డిప్యూటీ సిఎం అంజద్ బాష, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిల సహకారంతో తమవంతుగా తప్పక కలిసి వస్తామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, మహావధాని డాక్టర్ నరాల రామారెడ్డి, సబాధ్యక్షులు డాక్టర్ కె.నాగిరెడ్డి, లయన్స్ పాస్ట్ గవర్నర్ లయన్ చిన్నపరెడ్డి, రెడ్డి సేవా సమితి కార్యదర్శి కొండారెడ్డి, సుబ్బారెడ్డి, దేసు వెంకటరెడ్డి, లయన్స్ అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, డాక్టర్ మూలె రామ మునిరెడ్డి, జనార్ధనరాజు, లయన్ గౌరీశంకర్, కొండారెడ్డి, కార్పొరేటర్లు బాలస్వామిరెడ్డి, షఫీ, వైసిపి నాయకులు రవి, శ్రీరంజన్ రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి

మధ్యాహ్న భోజనం అమలుకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ప్రతి గర్భవతి, బాలింత అంగన్వాడీ కేంద్రంలో మధ్యాహ్నం భోజనంను కచ్చితంగా వినియోగించుకోనేల చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిడిపిఓలు, సఖీ వాన్ స్టాప్ సెంటర్, చిల్డ్రన్ హోమ్ తదితర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత, మాతా శిశు మరణాలను నివారించవచ్చునన్నారు. అంగన్వాడీ కేంద్ర పరిధిలోని 3-6 సంవత్సరాల పిల్లల హాజరు శాతంను పెంచాలని చెప్పారు. శిశువు అంగన్వాడీ కేంద్రంలోని పోషకాహారాన్ని తీసుకోవడం వలన పోషక ఆహార లోపం, వయసుకు తగ్గ ఎత్తు చేయవచ్చునని ఇందుకు పర్యవేక్షకులు కచ్చితంగా మండల అభివృద్ధి కార్యాలయంలో హాజరును వేసి అంగన్వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయుటకు ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం ఎన్ రాణి, కలెక్టర్ కార్యాలయ ఓఎస్‌డి రఘునాథ్, సిడిపిఓలు, సఖి వన్ స్టాప్ సెంటర్ అధికారులు పాల్గొన్నారు.

జ్వర బాధితురాలికి రక్తదానం

పోరుమామిళ్ల టౌన్: పట్టణానికి చెందిన షేక్ హసీనా ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో జ్వరం కారణంగా, రక్త హీనతతో చేరారు. ఆస్పత్రి సిబ్బంది ఎ బి పాజిటివ్ రక్తం ఏర్పాటు చేసుకోవాల్సిందిగా తెలుపగా పేషెంట్ బంధువులు రక్తం కోసం ప్రయత్నం చేశారు. రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు నాయబ్ రసూల్‌ని స్పందించి, కాశినయన మండలం మిద్దెల గ్రామానికి చెందిన రమణ ఎ బి పాజిటివ్ రక్తం దానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ ప్రసాద్, రసూల్ అడిగిన వెంటనే, రక్త దానం చేసినదుకు రమణను అభినందించారు. కార్యక్రమంలో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ రసూల్ ట్రస్ట్ సభ్యుడు అఖిల్, ల్యాబ్ అసిస్టెంట్ సుందరయ్య పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో తహశీల్దార్ తనిఖీ

పోరుమామిళ్ల టౌన్: పోరుమామిళ్ల మండలంలోని నరసింగపల్లె సమీపంలో ఉన్న భారత్ పెట్రోలియం పిఎస్ఆర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పోరుమామిళ్ల తహశీల్దార్ విజయ్ కుమారి తమ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెట్రోల్ బంక్‌లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కల్పించిన సదుపాయాలను వినియోగదారులకు సక్రమంగా అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ యానాదయ్య, విఆర్ఓ రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : ఆర్‌జెడి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌జెడి రవి పేర్కొన్నారు. బుధవారం సెయింట్ జోసెఫ్ జూనియర్ కాలేజీలో చీఫ్ సూపరింటెంట్స్, ఎగ్జామినర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుంచి మార్చి 7 వరకు ప్రాక్టికల్స్ ఉంటాయని తెలిపారు. పరీక్షల నిర్వహణ సమిష్టి బాధ్యతన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో వృత్తి విద్యాధికారి శ్రీనివాసుల రెడ్డి, ప్రాంతీయ పరీక్షల నిర్వహణ అధికారి రమణ రాజు, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు ప్రకాష్, సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్ అన్నారు. బుధవారం డిడియుజికేవై పథకం ద్వారా సీడప్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ శిక్షణ కేంద్రం ఆకస్మిక తనిఖీ చేశారు. శిక్షణ పొందుతున్న యువతీ యువకులను, శిక్షణ తరగతులను, భోజన వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడ ఇస్తున్న శిక్షణ కోర్సులు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్, కంప్యూటర్ హార్డ్వేర్ మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నవని చెప్పారు. శిక్షణ సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాల్లో పొందాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీడప్ జాబ్స్ డెవలప్మెంట్ మేనేజర్ వేణుమాధవ్, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్‌అహ్మద్, సిబ్బందిసుబ్బరామిరెడ్డి, గంగులయ్య, తేజ పాల్గొన్నారు.


శిక్షణ పొందుతున్న యువతతో డిఆర్‌డిఎ పీడీ

24న జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపికలు

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని డిఎస్ఎ క్రీడా మైదానంలో ఈ నెల 24వ తేదీ ఉదయం 8 గంటలకు ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ బాలుర జూనియర్ విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కంభం చిన్నపరెడ్డి, అరిగెల సింధూరి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు కర్నూలు నగరంలోని డిఎస్ఎ మైదానంలో నిర్వహించే 8వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్ బాలుర అంతర్ జిల్లాల హ్యాండ్ బాల్ చాంపియన్షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులకు ఈ నెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు కడప డిఎస్ఎ మైదానంలోని హ్యాండ్ బాల్ కోర్టులో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా జట్టు ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధృవపత్రం, పాస్ పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకురావాలని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్‌లో హోంగార్డు ప్రతిభ

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో హోం గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.కె.దస్తగిరి (హెచ్‌జి 432) టెన్నిస్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఎస్‌పి కెకెఎన్ అన్బురాజన్ ఆకాంక్షించారు. నగరంలో ఈ నెల 15 నుంచి 21 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ పోటీల్లో 35 ప్లస్ డబుల్స్ విభాగంలో తన పార్టనర్ అరుణ్ కుమార్‌రెడ్డితో కలిసి ఛాంపియన్ షిప్ గెలుపొంది విజయ బావుటా ఎగరేశాడు. బుధవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్‌పి దస్తగిరిని ప్రత్యేకంగా అభినందించారు. అకుంఠిత దీక్ష, పట్టుదల ఉంటే ఏమైనా సాధించవచ్చని దస్తగిరి నిరూపించారని, ముమ్మందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ ఎస్‌పి ప్రోత్సాహంతో తాను విజయాలు సాధించగలిగానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైదుకూరు డిఎస్‌పి ఎస్ఆర్.వంశీధర్ గౌడ్, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.


హోంగార్డుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్‌పి



పోలీసులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మేరీ సుజాత

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధుల్లో అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా పోలీస్ యూనిట్ వైద్యాధికారి మేరీ సుజాత సూచించారు. ఎస్పి అన్బురాజన్ ఉత్తర్వుల మేరకు ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం డాక్టర్ మేరీ సుజాత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ముద్దనూరు, కొండాపురం, కలమల్ల, తాళ్ళ ప్రొద్దుటూరు పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

నేడు మైదుకూరు మండల సమావేశం

ప్రజాశక్తి - మైదుకూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కులాయమ్మ తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలన్నారు.



పాడె మోస్తున్న సిఐ మంజునాథరెడ్డి

అనాథ వృద్ధుడి అంత్యక్రియల్లో సిఐ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని తిప్పలూరులోని ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథాశ్రమంలో ఉండే బేతంచెర్ల సత్యరాజు అనే వృద్ధుడు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ అంత్యక్రియలను సిఐ మంజునాథరెడ్డి దగ్గరుండి నిర్వహించారు. అనాథ వృద్ధుడి అంత్యక్రియల్లో పాల్గొని సిఐ తన మానవత్వాన్ని చాటుకున్నారు. విషయం తెలుసుకున్న పలువురు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించడం శివుడికి సేవ చేసుకోవడంతో సమానమన్నారు. భవిష్యత్‌లో కూడా ఎవరైనా అనాథలు చనిపోతే సొంత ఖర్చులతో అంతక్రియలు నిర్వహిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు నాగేంద్ర, మైదుకూరు జనసేన పార్టీ ఇన్‌ఛార్జి శ్రీరామ్ వంశీ, అభి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయబాబు, కానిస్టేబుల్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.



వివి కొట్టాల వద్ద మినుము సాగుకు సిద్ధంగా ఉన్న పొలాలు

రబీలో 3,350 ఎకరాల్లో పంటల సాగు

ప్రజాశక్తి - చాపాడు

రబీ సీజన్‌లో మండల వ్యాప్తంగా 3,350 ఎకరాల్లో పలు రకాల పంటలు సాగైనట్లు ఎఒ మ్యాగీ తెలిపారు. వరి, మినుము, పెసర, మొక్కజొన్న, నూగు వంటి పంటలు సాగు చేశారన్నారు. ఇందులో 3,225 ఎకరాలకు సంబంధించి రైతులు ఇకెవైసి కూడా పూర్తి చేశారని తెలిపారు. రబీ సీజన్‌లో 5,349 ఎకరాలు పంటలు సాగు చేస్తారని నమోదు చేశామన్నారు. కొంతమంది రైతులు పంటల సాగు ఆలస్యం అవుతుందని వేసవి పంటగా సాగు చేపడతారన్నారు. ఎన్.ఓబాయపల్లిలో అధికంగా 511 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయని తెలిపారు. అన్నవరంలో 391 ఎకరాలు, మడూరులో 384 ఎకరాలు, వెదురూరులో 358 ఎకరాలు, చిన్నగురువలూరులో 333 ఎకరాలు పంటలు సాగులో ఉన్నాయన్నారు.

'లూమెన్ టెక్నాలజీస్'కు సిబిఐటి విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి


ప్రజాశక్తి - చాపాడు

స్థానిక సిబిఐటి కళాశాలకు చెందిన చివరి సంవత్సరం విద్యార్థులు 10 మంది లూమెన్ టెక్నాలజీస్ కంపెనీకి ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. ఈనెల 18న కంపెనీ నిర్వహించిన రాత పరీక్షలో హ్యాకథాన్‌కు అర్హత సాధించారన్నారు. వీరికి వార్షిక వేతనం రూ.7.4 లక్షలని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి ప్లేస్మెంట్ ఆఫీసర్ వై.శ్రీధర్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి సూచించారు. పట్టణంలోని పలు సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, సచివాలయం ప్రజలకు చేయు సర్వీసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను అధికారులకు తెలిపి తక్షణమే పరిష్కరించాలని సూచించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహారెడ్డి

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు

కెఎస్ఆర్ హరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమ్మ హెల్పింగ్ హాండ్స్ కువైట్ వారి సహకారంతో మండల పరిధిలోని పల్లవోలు వద్దనున్న శ్రీ భగవాన్ కాశినాయన వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదానం చేశారు. శ్రావణ్ కుమార్ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా అతని తల్లిదండ్రులు నీరజ, రామ్మోహన్ యాదవ్ వృద్ధులకు అన్నదాన చేశారు. కార్యక్రమంలో కెఎస్ఆర్ హరిత ఫౌండేషన్ కదిరి సంజీవరాయుడు, టీం సభ్యులు, అమ్మ సేవా సమితి వాగ్దాడం శివశంకర్, ఆశ్రమ నిర్వాహకులు కటారి వెంకటయ్య పాల్గొన్నారు.



వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు

ఆశాజనకంగా వరి ధాన్యం ధరలు



వరి ధాన్యాన్ని తరలిస్తున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

గత ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ధాన్యం ధరలు ప్రస్తుతం పెరుగుతున్నాయి. డిసెంబర్‌లో వరి నూర్పిడి పనులు చేపట్టిన సమయంలో పుట్టి(8 బస్తాల) ధర రూ.12 వేల వరకు ఉండేది. ఆ తర్వాత జనవరిలో రూ.13 వేలకు పెరిగాయి. ప్రస్తుతం పుట్టి వరి ధాన్యం ధర రూ.15వేల వరకు ఉంది. గత ఏడాది మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 16 వేల ఎకరాల్లో వరి సాగైంది. వరి పంట ఆశాజనకంగా ఉండడంతో దిగుబడి పెరిగింది. ఎకరాకు 32 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.30 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయని రైతులు పేర్కొంటున్నారు. దిగుబడి పెరగడం, ధరలు ఆశాజనకంగా ఉండడంతో సాగు ఖర్చులు పోనూ రైతులు ఆదాయాన్ని చవిచూస్తోంది. గత ఏడాది అధిక వర్షాలు, వరద తాకిడితో వరి పంట ఎక్కువగా దెబ్బతింది. వర్షానికి పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.6వేలు నష్టపరిహారం మంజూరైంది. గత ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ధాన్యం(పాత ధాన్యం) ధర రూ.20 వేలకు పైగా ధర పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో వరి ధాన్యాన్ని నిల్వ ఉంచిన రైతులు అమ్మకాలకు సిద్ధపడుతున్నారు.

సమన్వయ లోపం లేకుండా చూసుకుంటాం : ఎంపీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి పొన్నపురెడ్డి పి.రామసుబ్బారెడ్డి గ్రూపుల మధ్య సమన్వయ లోపం, భేదాభిప్రాయాల్లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2009 నుండి వైసిపి వెంట ఉండి నడిచిన కార్యకర్తలకు, నాయకులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో ఇరువురు నాయకులు ముందుకు వెళ్లేలా చూస్తామన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసిపిలో చేరిన నాటి నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం మేరకే పని చేసుకుంటూ ముందుకెళుతున్నామన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా పని చేసేందుకు ముందుంటానని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిర్ణయమే తనకు శిరోధార్యమన్నారు. తొమ్మిదేళ్లుగా వైసిపి కోసం పనిచేస్తున్న వారందరికీ న్యాయం జరిగేలా సమన్వయంతో ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, పట్టణ వైసిపి అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, వైసిపి మైనార్టీ నాయకులు బేపారి షామీర్ అలీ, డైరెక్టర్ మార్బుల్ శీను, కాప్షన్ సభ్యులు లక్ష్మయ్య, నాగేశ్వర్‌రెడ్డి, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రేపు అత్యాధునిక ఆర్థో, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం



ప్రజాశక్తి - కడప సిటీ

కడప పట్టణంలోని కొత్త బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వద్ద అత్యాధునిక సౌకర్యాలతో జెబి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు ప్రముఖ కీళ్ల మార్పిడి, కీహోల్ సర్జన్ డాక్టర్ జహంగీర్ భాషా, హాస్పిటల్ ఎండి డాక్టర్ జయభారతి తెలిపారు. ఆ మేరకు బుధవారం వారు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ.. తమ హాస్పిటల్‌లో పూర్తి ఆర్థోపెడిక్ చికిత్సలు చేస్తామన్నారు. ప్రైమరీ, రివిజన్ రీప్లేస్మెంట్ సర్జరీలు, కీహోల్ సర్జరీలు, కాంప్లెక్స్ ట్రామ కండిషన్లకు అత్యాధునిక పరికరాలతో ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. రాయల సీమలోనే మొదటి సారిగా 'రీ జనరేటివ్ ఆర్థోపెడిక్ సెంటర్, అడ్వాన్స్ రుమటాలజీ సెంటర్' నెలకొల్పామన్నారు. మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి, కీళ్లవాతం సూదితోనే నయం చేసే విధానం ప్రారంభించారు. రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ అనే ట్రీట్మెంట్ కన్నా అది తక్కువ ధరతో మోకాలు నొప్పి తగ్గించే జనికులర్ బ్లాక్ అనే ట్రీట్మెంట్‌ని ప్రారంభించడం జరిగింది. మొట్ట మొదటిసారిగా ఓజోన్‌థెరపి, ఐఎల్ఆర్ఎపిఆర్‌పి, బిఎంఎసిచే కంబైన్డ్ ట్రీట్మెంట్‌తో మోకాళ్ళ నొప్పి, నడుము నొప్పిని పూర్తిగా నయం చేయనున్నట్లు వివరించారు. తమ వద్ద పాలిట్రామ మరియు అన్ని రకాల కేసులు 24గంటలు చూడనున్నట్లు తెలిపారు. బర్డ్స్ తరహా మోకాళ్ళ మార్పిడి సేవలు అతి తక్కువ ధరకు, అత్యున్నత నాణ్యతతో, గొప్ప నైపుణ్యంతో, అత్యాధునిక యాంటీబయాటిక్ కోటెడ్ వాల్స్ గల ఆపరేషన్ థియేటర్లలో చేయనున్నట్లు తెలిపారు. ఆపరేషన్ చేయించుకుని చీము పట్టినను, ఆపరేషను ఫెయిల్ అయినను ఆరోగ్యశ్రీ కింద మళ్లీ ఆపరేషన్ చేసి నడిపించబడును అని తెలిపారు. రుమటాలజీ (కీళ్లవాతం)లో బయోలాజికల్ రుమటాలజీ ట్రీట్మెంట్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ట్రీట్మెంట్ ద్వారా జబ్బు మూలాన్ని సరి చేయనున్నట్లు వారు తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.



డాక్టర్ జహంగీర్ బాషా డాక్టర్ జయభారతి

పరిసరాల శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.ఖాదర్‌వలి సూచించారు. మండలంలోని చిలమకూరు పిహెచ్‌సిని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్తగా నమోదైన కుష్టు వ్యాధిగ్రస్తుల శరీర భాగాలను పరీక్షించి, చికిత్స గురించి వివరించారు. కుష్టు, టిబి రోగుల గురించి విచారించి, చికిత్స, మందుల వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఆశా వర్కర్ డాట్ ప్రొవైడర్‌గా టిబి మందులు సక్రమంగా రోగులకు ఇంటి దగ్గరే ఇవ్వాలని సూచించారు. జాతీయ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇందిరా కాలనీలోని టిబి రోగులను విచారించి, మందులు ఎలా వాడాలో తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్మా, డాక్టర్ సాయిచరిత, డిపిఎంఒ వీరభద్రయ్య, టిబి సూపర్‌వైజర్ సునీల్, హెల్త్ ఎడ్యుకేటర్ నాగ మునిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ విజయమ్మ, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



టిబి రోగులను విచారిస్తున్న వైద్యాధికారులు

నడకతో బిపి, చక్కెర వ్యాధి తగ్గుదల



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అయోషా సుల్తానా

ప్రజాశక్తి - ఖాజీపేట

రోజూ వారీ నడక వల్ల బిపి, చక్కెర వ్యాధి తగ్గుతుందని డాక్టర్ ఎస్.అయోషా సుల్తానా తెలిపారు. మండల పరిధిలోని చెన్న ముక్కపల్లె సమీపంలోని పునీత లారెన్స్ అనాధశ్రమంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిపి, చక్కెరవ్యాధి, ఒళ్లు నొప్పులకు మందులను అందజేశారు. ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్.అయోషా సుల్తానా పరీక్షలు చేసి చికిత్స లందించారు. ప్రతి రోజు ఉదయం నడవాలన్నారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం మాట్లాడుతూ క్రమం తప్పకుండా నడకతోపాటు ప్రతి రోజు ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో పునీత లారెన్స్ అనాథ ఆశ్రమం నిర్వాహకులు చెన్నయ్య, సిహెచ్ఒ వెంకటసుబ్బమ్మ, పిహెచ్ఎన్ అరుణ కుమారి, ఎఎన్ఎం వెంకటతులసి, ఆశా కార్యకర్త ఆరోగ్యమ్మ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

ప్రమాదకరంగా రోడ్డు - పట్టని అధికారులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రమాదాలకు నిలయంగా రహదారి మధ్యలో ఒక గుంత దర్శనం ఇస్తుంది. వాహనచోదకులు ఆదమరిస్తే ప్రమాదానికి గురై గాయాలపాలు కావాల్సిందే. మండల పరిధిలోని కొత్తరోడ్డు సున్నపురాళ్ళపల్లె గ్రామం మధ్యలో కాలువపై ఒక పెద్ద గుంత 2021 వర్షాకాలంలో ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ గుంతను పూడ్చేవారు లేరు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ దారిలో సున్నపురాళ్ళ పల్లెతో పాటు, కన్యతీర్థం, సిరిగేపల్లి, పెద్ద దండ్లూరు, థర్మల్‌కు నిత్యం ఆటోలు, ట్రక్కులు, బూడిద లారీలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల సిఎం జగన్ రాక సందర్భంగా ఈ దారి వెంబడి ప్యాచ్‌లు వేశారు. కానీ పెద్ద గుంతను పూడ్చి వేయడంలో మరిచారు. గతంలో ద్విచక్రవాహనదారులు కిందపడి కాళ్లు, చేతులు విరగొట్టుకున్న సంఘటనలున్నాయి. ఓ బూడిద ట్యాంకు గుంతను తప్పించబోయి పక్కనే ఉన్న కాలువలోకి వెళ్లింది. ఇప్పటికైనా ప్రమాదాలకు నిలయంగా ఉన్న గుంతను పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.



దారి మధ్యలో ఏర్పడిన గుంత



ప్రొద్దుటూరులో ఉయ్యాలవాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

'ఉయ్యాలవాడ' వీరత్వం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని నరసింహారెడ్డి క్యాంస విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు డాక్టర్ వై.వి.స్వరూప్ కుమార్‌రెడ్డి, టిటిడి పాలక మండలి సభ్యులు మారుతీప్రసాద్ మాట్లాడుతూ ఉయ్యాలవాడ ప్రథమ స్వాతంత్ర్య సమర యోధుడని, బ్రిటీష్ పాలకుల గుండెల్లో గుబులు పుట్టించిన పరాక్రమశాలిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ముడిమేల కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, కోశాధికారి కోట ఓబులరెడ్డి పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176వ వర్ధంతి సందర్భంగా రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు సురేంద్రారెడ్డి, రాష్ట్ర కోశాధికారి సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్య దర్శి పవన్‌కుమార్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు కన్వీనర్ శివారెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లె : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట పటిమ, వీరత్వం ప్రతి తెలుగు వాడికి, భారతీయుడికి స్ఫూర్తి దాయకమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్. తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి తులసిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1857లో జరిగిన ప్రథమ భారత స్వతంత్ర సంగ్రామానికి (సిపాయిల తిరుగుబాటు) పదేళ్ల ముందే ఆంగ్లేయుల దుష్ట పాలనపై తిరుగుబాటు చేసి వీర మరణం పొందిన స్వతంత్ర సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అన్నారు. 1847లో కోయిలకుంట్లలో జర్రేటి వాగు ఒడ్డున 2వేల మంది ప్రజల సమక్షంలో ఆంగ్లేయులు నరసింహారెడ్డిని ఉరి తీశారన్నారు. అలాగే మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కూడా తులసిరెడ్డి నివాళులర్పించారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అసలైన జాతీయవాది అన్నారు. హిందు, ముస్లిం ఐక్యతకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, ఉత్తన్న, చెన్నకేశవ, బద్రీ, నరసింహారెడ్డి, శివయ్య పాల్గొన్నారు.



దోమల నివారణకు చర్యలు చేపట్టిన మున్సిపల్ సిబ్బంది

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - జమ్మలమడుగు

స్థానిక పొద్దుటూరు రోడ్డు నుండి కన్నెలూరు చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉంచేందుకు బుధవారం అధికారులు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి తెలిపారు. 'ప్రజాశక్తి' దినపత్రికలో 'బాబోయ్.. దోమలు..!' అనే శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైంది. ఇందుకు మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా శానిటరి ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా మాట్లాడుతూ దోమల నివారణకు ప్రత్యేకంగా ఫాగింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు. మురుగు నీటిలో ఆయిల్‌బాల్స్, దోమల నివారణకు ప్రత్యేకంగా పౌడర్‌ను చల్లించామన్నారు. మురుగు కాలువలో ఉన్న వ్యర్థాలను తొలగించామన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంపై దాడులు పిరికిపంద చర్య

ప్రజాశక్తి - మైదుకూరు

గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై వల్లభనేని వంశీ అనుచరులు, వైసిపి నేతల దాడి పిరికిపంద చర్య అని మాజీ కౌన్సిలర్ కొండపేట షరీఫ్ తెలిపారు. మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ 5వ వార్డ్ టిడిపి కార్యాలయంలో బుధవారం షరీఫ్ మాట్లాడుతూ గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండించారు.

నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన మాట ఏమైంది..?

ప్రజాశక్తి - వేంపల్లె

సిఎం జగన్‌రెడ్డి పాదయాత్రలో నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తానని చెప్పిన వాగ్దానం ఏమైందని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గూడూరు రామచంద్ర బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. వైసిపి పాలనలో సిఎం జగన్ రాజ్యాంగ పరమైన పదవులు ఇవ్వకుండా అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. బిసిలకు సామాజిక న్యాయమని చెబుతూ కొన్ని కులాలకే ప్రాధాన్యత నివ్వడం శోచనీయమన్నారు. అధికారం రాక ముందు ప్రాధాన్యత ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పడం సిగ్గుచేటన్నారు. నాయీ బ్రాహ్మణులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని, ఇలాగే కొనసాగితే రాజ్యాధికారనికి దూరమైన అన్ని కులాలు ఐక్యంగా పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

అరటి సాగులో మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

అరటి సాగు చేసే ప్రతి రైతు మెలకువలు పాటించాలని అరటి పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ సుశీల, జిల్లా ఉద్యానవన అధికారి సుభాషిణి సూచించారు. వేంపల్లె, వీరపునాయునిపల్లె మండలాల్లోని అమ్మగారిపల్లె, మద్రిపల్లె గ్రామాల్లో సాగు చేసిన అరటి తోటలను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అరటి మొక్కలు కొనుగోలు చేసేటప్పుడు నాణ్యతగల వాటిని కొనుగోలు చేయాలని సూచించారు. బెంగళూరుకు చెందిన ప్రయివేట్ కంపెనీ రైతులకు సరఫరా చేసిన 40వేల అరటి మొక్కల్లో 8వేలు మొక్కలు నాసిరకంగా ఉన్నాయని రైతులు ఫిర్యాదు చేశారు. మొక్కలు కొనుగోలు చేసే సమయంలో ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని కోరారు. అరటి రైతులతో పంట దిగుబడిపై చర్చించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి రెడ్డయ్య, రైతు భరోసా ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాస్త్రవేత్తలు

పిహెచ్‌సి సిబ్బందికి అభినందనలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల పిహెచ్‌సిని బుధవారం అదనపు డిఎంహెచ్ఒ ఖాదర్‌వలి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణ శుభ్రంగా ఉండడం వల్ల వైద్యులను, సూపర్‌వైజర్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న, సూపర్‌వైజర్ ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పులివెందుల డిఎస్‌పి శ్రీనివాసులు సూచించారు. స్థానిక జెఎన్‌టియు కళాశాలలో బుధవారం సైబర్ నేరాలు, సఖిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీనివాసులు, దిశా డిఎస్‌పి వాసుదేవన్ మాట్లాడుతూ లోన్‌యాప్‌లు, ఉద్యోగ యాప్‌లు క్లిక్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మనకు అవసరమైన రీతిలో మాత్రమే వినియోగించాలని సూచించారు. లైంగిక వేధింపులకు గురైన వారిని, మేమున్నామంటూ సాదరంగా అందరూ ధైర్యం చెప్పి ఆదరించాలన్నారు. చిన్నపిల్లలను సైతం అసభ్యకర చిత్రాలతో పాడు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వసుంధర, మహిళా సాధికారత కో-ఆర్డినేటర్ శేష మహేశ్వరమ్మ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.